క్లుప్తంగా

జీఐఎస్ పనుల పరిశీలన



నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లాలోని రూరల్ ప్రాంతాల్లో జీఐఎస్ పనులను ఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (టెక్నికల్) నందిమండలం సుబ్బరాజు క్షేత్రస్థాయిలో బుధవారం పరిశీలించారు. విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్ల వద్దకు వెళ్లి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. జీఐఎస్‌తో విద్యుత్ సమస్యలను పరిష్కరించుకోవడంతో పాటు అనధికార కనెక్షన్లకు చెక్ పెట్టొచ్చని చెప్పారు. ట్రాన్స్‌ఫార్మర్లకు క్యూఆర్ కోడ్ స్టిక్కర్లను ఏర్పాటు చేయడం ద్వారా సరఫరాలో ఏర్పడే అంతరాయాలను త్వరితగతిన తెలుసుకునే అవకాశం కలుగుతుందని చెప్పారు. జిల్లాలోని వ్యవసాయ విద్యుత్ సర్వీసులకు జియో ట్యాగింగ్ చేయనున్నామని వెల్లడించారు.

స్మార్త వైదిక పాఠశాల ప్రారంభం



నెల్లూరు(బృందావనం): భారతీయ సనాతన ధర్మ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ప్రముఖ స్మార్త, వేదపండితుడు గుండాపంతుల రామసుబ్రహ్మణ్యశర్మ పేర్కొన్నారు. విజయమహల్ గేట్ వద్ద చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆదిశంకర ధ్యాన మందిరంలో జ్ఞానసరస్వతి స్మార్త వైదిక విద్యా పాఠశాలను బుధవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా సమయానందనాథస్వామి మాట్లాడారు. రుద్రం, సంధ్యావందనం, తదితర అంశాలను పాఠశాలలో బోధించనున్నామని పేర్కొన్నారు. ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్, పారా శ్రీధర్‌శర్మ, రామాయణం మణిశంకరశర్మ, మైపాడు రాజా, తదితరులు పాల్గొన్నారు.

వాసు ముదిరాజ్‌కు నివాళి



నెల్లూరు (వేదాయపాళెం): ఇటీవల మృతి చెందిన ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర కార్యదర్శి బుడిగి వాసుకు సంఘ నేతలు నివాళులర్పించారు. రామలింగాపురంలోని గంజిఖానా వీధిలో గల నివాసంలో బుధవారం నిర్వహించిన వాసు ముదిరాజ్ పెద్ద కర్మ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేశారు. కార్యక్రమంలో ఏపీ ముదిరాజ్ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు కొర్నా వెంకటనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పరిపాలనకు దిక్సూచి 'జగనన్నకు చెబుదాం'

నెల్లూరు(దర్గామిట్ట): జగనన్నకు చెబుదాం కార్యక్రమం భవిష్యత్తు పరిపాలనకు దిక్సూచి లాంటిదని కలెక్టర్ హరినారాయణన్ పేర్కొన్నారు. మండల స్థాయి అధికారులు, మున్సిపల్ అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌ను కలెక్టరేట్లోని తిక్కన ప్రాంగణం నుంచి బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టి ఉన్నత స్థాయిలో సమీక్షిస్తోందని, దీనికి అనుగుణంగా ఆయా శాఖల నోడల్ అధికారులు బాధ్యతతో పనిచేయాలని కోరారు. అర్జీల పరిష్కారంలో తప్పులను వివరించి భవిష్యత్తులో అలాంటివి పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ఆయుష్మాన్ భారత్‌లో ఈ – కేవైసీని త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీ సీఈఓ చిరంజీవి, డీఆర్డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాద ఘటనలో ఒకరిపై కేసు నమోదు

తోటపల్లిగూడూరు : మండలంలోని చింతోపు సమీపంలో ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ఘటనకు సంబంధించి ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జంపానికుమార్ వెల్లడించారు. ఆయన బుధవారం వెల్లడించిన వివరాల మేరకు.. ఈనెల 16వ తేదీ రాత్రి చింతోపు గ్రామానికి చెందిన నెట్రంబాకు గోపి, పూరి మహేంద్ర మోటారు బైక్‌పై నరుకూరు నుంచి చింతోపు వెళ్తున్నారు. ఇదే సమయంలో చింతోపునకు చెందిన లేబూరు బాలాజీ కారులో సౌత్‌ఆములూరు నుంచి స్వగ్రామానికి వస్తున్నాడు. ఈ క్రమంలో చింతోపు వద్ద కారు, మోటారు బైక్ బలంగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో బైక్‌పై ప్రయాణిస్తున్న గోపి, మహేంద్ర గాయపడ్డారు. కాగా లేబూరు బాలాజీ తమను ఉద్దేశ పూర్వకంగానే కారుతో ఢీకొట్టి చంపబోయాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఎస్సై జంపానికుమార్ ఘటనా స్థలంలో విచారణ జరిపారు. లేబూరు బాలాజీపై మంగళవారం రాత్రి కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.50 లక్షలతో ఆజాద్ సెంటర్ అభివృద్ధి

• ఎమ్మెల్యే అనిల్‌కుమార్

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ములుమూడి బస్టాండ్ సమీపంలోని ఆజాద్ సెంటర్‌ను రూ.50 లక్షలతో అభివృద్ధి చేయనున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనను బుధవారం చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడారు. ఈ ప్రాంతంలో ఐల్యాండ్‌ను నిర్మించి, చుట్టుపక్కల ఆధునీకరణ పనులను చేపట్టనున్నామని వెల్లడించారు. ఐల్యాండ్‌కు ఐదు వైపులా రోడ్ల నిర్మాణానికి గానూ టెండర్లను త్వరలో పిలవనున్నామని పేర్కొన్నారు. ములుమూడి బస్టాండ్ సెంటర్‌లో ప్రజలు కూర్చునేందుకు, తాగునీటి సదుపాయం, తదితర మౌలిక వసతులను కల్పించాలని ఆదేశించారు. నియోజకవర్గంలో దాదాపు 8 వేల మొక్కలను నాటి, వాటి సంరక్షణ బాధ్యతను తామే తీసుకున్నామన్నారు. నియోజకవర్గంలో చాలా వరకు రోడ్ల నిర్మాణాలను పూర్తి చేశామని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంలో భూగర్భ డ్రైనేజీ నిర్మాణమంటూ రోడ్లను ధ్వంసం చేశారని ధ్వజమెత్తారు. పెద్దబజార్ చేపల మార్కెట్ వద్ద వస్త్ర వ్యాపారులు దుకాణాల్లో కాకుండా రోడ్లపైకి వచ్చి విక్రయించుకుంటున్నారని, గత ప్రభుత్వంలో ఏ మాత్రం నాణ్యతగా నిర్మించారో ఈ విషయం ద్వారా తెలుస్తోందని చెప్పారు. సంతపేట మార్కెట్ వద్ద షాపింగ్ కాంప్లెక్స్‌ను నిర్మించారని, అయితే మొత్తాన్ని తొలగించి మరోసారి నిర్మించాల్సి వచ్చిందని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ప్రజలపై అనేక భారాలను మోపారని, ఈ విషయమై చర్చకు సిద్ధమానని టీడీపీ నేత నారాయణకు సవాల్ విసిరారు. తమ ప్రభుత్వం ఏర్పడ్డాక రోడ్లు, డ్రెయిన్లు, స్కూళ్లు, అర్బన్ హెల్త్ సెంటర్లు, పార్కులను అభివృద్ధి చేశామని తెలిపారు. డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్, కార్పొరేటర్లు వేలూరు మహేష్, పొట్లూరి రామకృష్ణ ఆచారి, మొగ్గళ్లపల్లి కామాక్షిదేవి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నేత వందవాసి రంగ, తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులకు శంకుస్థాపన కార్యక్రమంలో అనిల్‌కుమార్

ప్రజలకు ఉపయోగపడేలా పనులు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): ప్రజలకు ఉపయోగపడే పనులను చేపడుతున్నామని నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్ పేర్కొన్నారు. నగరంలోని ఏడో డివిజన్లో గల నాగేంద్రనగర్, ముస్లిం వీధి, పుట్టవీధి, తదితర ప్రాంతాల్లో నిర్వహించిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. సాంకేతిక కారణాలతో సంక్షేమ పథకాలు అందని వారికి సైతం వర్తించేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా పర్యటించిన సమయంలో పలు సమస్యలను ప్రజలు తెలియజేశారని, వీటికి సంబంధించి రూ.13 కోట్లతో పనులు జరుగుతున్నాయని వెల్లడించారు. పది సచివాలయాలకు సంబంధించి రూ.రెండు కోట్ల పనులు ఉన్నాయని, వీటిని సైతం పూర్తి చేస్తామని ప్రకటించారు. మైపాడు రోడ్డు పనులు మరో నెల్లో పూర్తవుతాయని తెలిపారు. నగరంలో పూర్తిగా లైటింగ్ సిస్టమ్‌ను అందుబాటులోకి తీసుకురానున్నామని చెప్పారు. నియోజకవర్గంలో స్నాచింగ్‌లు, అల్లరి మూకల ఆగడాలను అరికట్టాలనే లక్ష్యంతో దాదాపు వెయ్యి సీసీ కెమెరాలను ఏర్పాటు చేయనున్నామని వెల్లడించారు. కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలను ఆరాతీస్తున్న ఎమ్మెల్యే అనిల్

సినిమాలకు హబ్‌గా సింహపురి

నెల్లూరు(బృందావనం): సినిమాలకు హబ్‌గా నెల్లూరు మారుతోందని 25 కళాసంఘాల అధ్యక్షుడు అమరావతి కృష్ణారెడ్డి పేర్కొన్నారు. లింబో చిత్ర స్క్రిప్టునకు పూజా కార్యక్రమాన్ని రాయాజీవీధిలోని ఆంజనేయస్వామి దేవస్థానంలో బుధవారం నిర్వహించారు. అనంతరం క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. దేవస్థాన ధర్మకర్తల మండలి చైర్మన్ సూరిశెట్టి ఉమాసురేంద్ర, చిత్ర దర్శకుడు సుధాకర్‌రెడ్డి, షంషుద్దీన్, కళాంజలి అనంత్, కళాసంఘాల కన్వీనర్లు దోర్నాల హరిబాబు, అమీర్‌జాన్, నేదురుమల్లి హరనాథ్‌రెడ్డి, భాస్కర్, సింహపురి మూవీ అసోసియేషన్ అధ్యక్షుడు పొంగూరు సుబ్బారెడ్డి, మురళీమోహన్ రాజు, తదితరులు పాల్గొన్నారు.



షూటింగ్‌ను ప్రారంభిస్తున్న కృష్ణారెడ్డి

విద్యార్థినులకు అవగాహన

నెల్లూరు (టౌన్): బాల్య వివాహాలు, గుడ్ టచ్.. బ్యాడ్ టచ్, తదితర అంశాలపై విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాన్ని దర్గామిట్టలోని కస్తూరిదేవి స్కూల్లో బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా దిశ డీఎస్పీ సురేష్‌బాబు మాట్లాడారు. బాలికలతో ఎవరైనా అసభ్యకరంగా ప్రవర్తిస్తే తల్లిదండ్రులు లేదా ఉపాధ్యాయులకు తెలియజేయాలని సూచించారు. బాల్య వివాహాలతో సంభవించే అనర్థాలను తెలియజేశారు. బాలల సంరక్షణాధికారి సురేష్, ప్రధానోపాధ్యాయులు వనజ, ఉపాధ్యాయులు శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సురేష్‌బాబు

సమగ్ర విచారణకు వినతి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయంలో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న వ్యక్తి పలు అక్రమాలకు పాల్పడ్డారని, ఆయనపై ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరపాలని ఎస్ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాజా కోరారు. నగరంలోని ఓ ప్రైవేట్ కళాశాలలో విలేకరుల సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఎస్ఎస్‌యూఐ నగర కార్యదర్శి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(బృందావనం): రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గౌస్ పేర్కొన్నారు. భక్తవత్సలనగర్‌లోని పింఛనర్ల సంక్షేమ సంఘ భవన్‌లో బుధవారం నిర్వహించిన విశ్రాంత ప్రభుత్వోద్యోగుల జిల్లా సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ప్రభుత్వోద్యోగులకు సంబంధించిన అరియర్స్ పెండింగ్‌లో ఉన్నాయని, ఈ విషయంలో ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు. తొలుత పింఛనర్లకు రక్త పరీక్షలను చెన్నై హాస్పిటల్స్ ఇన్ఫర్మేషన్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎస్వీవీఎస్ మూర్తి, చెంచురెడ్డి, సంఘ జిల్లా కోశాధికారి హజరత్తయ్య, రాష్ట్ర ఉపాధ్యక్షుడు రమణయ్య, నేతలు కోటేశ్వరరావు, సుధాకర్‌రావు, రాష్ట్ర కార్యదర్శి మాలకొండయ్య, అసోసియేట్ అధ్యక్షుడు శ్రీనాథ్, కార్యనిర్వాహక కార్యదర్శి రఘునాథ్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గౌస్

న్యాయవాదుల కోర్టు విధుల బహిష్కరణ నేడు

నెల్లూరు (లీగల్): కృష్ణా జిల్లా మొవ్వ బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావుపై దాడికి నిరసనగా కోర్టు విధులను న్యాయవాదులు గురువారం బహిష్కరించనున్నారని నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఉమామహేశ్వర్, ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి అన్వర్‌బాషా, ట్రెజరర్ రమేష్ తెలిపారు. జిల్లా కోర్టు ఆవరణలోని బార్ అసోసియేషన్ సమావేశ మందిరంలో అత్యవసర కమిటీ సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. న్యాయవాదిపై దుండగుల దాడిని ఖండిస్తూ కోర్టు విధులను బహిష్కరించాలని నిర్ణయించారు.

భక్తులకు ఇబ్బందులు తలెత్తకూడదు

• ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): ఈ నెలాఖరులో నెల్లూరులో నిర్వహించనున్న రొట్టెల పండగకు వచ్చే భక్తులు ఏఎస్‌పేటలోని హజరత్ ఖాజానాయబ్ రసూల్ దర్గానూ సందర్శిస్తారని, వీరికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఏఎస్‌పేట మండలాధికారులు, వక్ఫ్‌బోర్డు, నేతలతో బుధవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. దర్గా పరిసర ప్రాంతాలు, పంచాయతీ మొత్తం పారిశుధ్య పనులను చేపట్టాలని, మంచినీటి సౌకర్యం, బసతో పాటు అదనంగా మరుగుదొడ్లను ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. అదనంగా బస్సులను నడిపేలా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపట్టాలని సూచించారు. తహసీల్దార్ రమణరావు, ఎంపీడీఓ భాస్కర్, ఎస్సై నరేష్, దర్గా ఈఓ హుస్సేన్, మండల కో ఆప్షన్ సభ్యుడు సందానీబాషా, మాజీ ఎంపీటీసీ సభ్యుడు షబ్బీర్, వక్ఫ్‌బోర్డు జిల్లా వైస్ చైర్మన్ షౌకత్ అలీ, జిలానీ, హరికృష్ణారెడ్డి, ఖాదర్‌బాషా, తదితరులు పాల్గొన్నారు.

అన్నదానానికి రూ.25 వేల అందజేత

మొహర్రంను ఘనంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని ఎల్‌ఆర్‌పల్లి పీర్లచావిడి వద్ద నిర్వహించనున్న మొహర్రం వేడుకలకు ఎమ్మెల్యేను స్థానిక యువత ఆహ్వానించారు. అన్నదానానికి తన వంతుగా రూ.25 వేలను ఎమ్మెల్యే అందజేశారు. రిజ్వాన్ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి

గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా ప్రజలు అందజేసే అర్జీలను పరిష్కరించేలా అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి పేర్కొన్నారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో ఆత్మకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓలతో నిర్వహించిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. జగనన్న సురక్ష కార్యక్రమం నియోజకవర్గంలో విజయవంతంగా జరుగుతోందని పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతి ఒక్కరికీ ధ్రువీకరణ పత్రాలను అందజేసేలా చర్యలు చేపట్టాలని కోరారు.

గృహ నిర్మాణాలు వేగవంతం

ఆత్మకూరు నియోజకవర్గంలోని ప్రతి లేఅవుట్లో జగనన్న ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ఆదేశించారు. నగరంలోని తన క్యాంప్ కార్యాలయంలో అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గానికి సుమారు 15 వేల ఇళ్లు మంజూరయ్యాయని, డిసెంబర్‌లోపు నిర్మాణాలను పూర్తి చేయాలని సూచించారు.



మాట్లాడుతున్న మేకపాటి విక్రమ్‌రెడ్డి

చలో విజయవాడ జయప్రదానికి పిలుపు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఈ నెల 26న నిర్వహించతలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దుగ్గిరాల సూరిబాబు పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో బుధవారం ఆవిష్కరించిన అనంతరం ఆయన మాట్లాడారు. వివిధ సమస్యలను పరిష్కరించాలనే డిమాండ్‌తో విజయవాడలోని ఎంజీ విజ్ఞాన కేంద్రంలో సదస్సును నిర్వహించనున్నామని వివరించారు. ఆంధ్రప్రదేశ్ విద్యుత్ ట్రేడ్ యూనియన్ స్ట్రగుల్ కమిటీగా ఏర్పడి భవిష్యత్తు కార్యాచరణను రూపొందించనున్నామని తెలిపారు. యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రసాద్, జిల్లా ప్రధాన కార్యదర్శి జాకీర్‌హుస్సేన్, యూనియన్ నేతలు పెంచలప్రసాద్, హజరత్, సురేంద్ర, రామయ్య, హరినారాయణ, నాగయ్య, కృష్ణ, సుమన్, తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

ఎమ్మెల్యే అనిల్‌పై బురదజల్లడం తగదు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట): నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌పై బురదజల్లడాన్ని మానుకోవాల్సిందిగా టీడీపీ నేతలకు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నేత సమీర్‌ఖాన్ హితవు పలికారు. జెండావీధిలోని డిప్యూటీ మేయర్ ఖలీల్ అహ్మద్ కార్యాలయంలో విలేకరులతో బుధవారం ఆయన మాట్లాడారు. నారాయణ కళాశాల సిబ్బందితో దొంగ ఓట్లు చేర్చేందుకు ప్లాన్ వేస్తూ తమపై ఆరోపణలు చేయడం సబబు కాదన్నారు. చిన్న వీధుల్లో సైతం సిమెంట్ రోడ్లను ఎమ్మెల్యే అనిల్ వేయించారని తెలిపారు. ముస్లింలకు నారాయణ తీవ్ర అన్యాయం చేశారని ఆరోపించారు.




మాట్లాడుతున్న సమీర్‌ఖాన్

అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ప్రవేశాలకు గడువు పొడిగింపు

నెల్లూరు(టౌన్): అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీలో డిగ్రీ కోర్సుల్లో ప్రవేశానికి గడువును ఈ నెల 31 వరకు పొడిగించారని డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాల అధ్యయన కేంద్ర కో ఆర్డినేటర్ కరుణశ్రీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్, ఐటీఐ, డిప్లొమా పాసైన వారు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. డిగ్రీ ద్వితీయ, తృతీయ సంవత్సర విద్యార్థులు ట్యూషన్ ఫీజును ఈ నెల 31లోపు చెల్లించాలని కోరారు. వివరాలకు 73829 29759 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

డీఎంహెచ్‌ఓను కలిసిన నేతలు



నెల్లూరు(బారకాసు): నగరంలోని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ కార్యాలయంలో డీఎంహెచ్‌ఓ పెంచలయ్యను ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు బుధవారం కలిశారు. ఈ సందర్భంగా ఆయన్ను సత్కరించారు. అసోసియేషన్ గౌరవాధ్యక్షుడు డాక్టర్ విద్యాసాగర్, అధ్యక్షుడు హరిబాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, జాయింట్ సెక్రటరి ఖాదర్ మస్తాన్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలను పరిష్కరించరూ..

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లెల ఝాన్సీరాణిని ప్రొద్దుటూరులోని ఆమె నివాసంలో సహకార బ్యాంక్ రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా నేతలు బుధవారం కలిశారు. తమిళనాడు తరహాలో విశ్రాంత డీసీసీబీ ఉద్యోగులకు కనీస పింఛన్ రూ.ఐదు వేలను అందజేసేలా చూడాలని కోరారు.

బాలసుధాకర్‌కు ఘన సన్మానం

నెల్లూరు(వీఆర్సీసెంటర్): పీసీసీ సభ్యుడు తలారి బాలసుధాకర్‌ను నగరంలోని ఓ కల్యాణ మండపంలో బుధవారం సత్కరించారు. ఆయన జన్మదినాన్ని పురస్కరించుకొని ఏసీ సుబ్బారెడ్డి వాకర్స్ అసోసియేషన్, కాంగ్రెస్ పార్టీ నేతల ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని నిర్వహించారు. కనకట్ల రఘురామ్ ముదిరాజ్, రమణయ్యగౌడ్, సత్యం, బలరామయ్యనాయుడు, తిరుపతినాయుడు, డాక్టర్ శ్రీధర్, సుబ్బారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



కాలువల్లో వ్యర్థాలు వేస్తే జరిమానా

నెల్లూరు(బారకాసు): మురుగు కాలువల్లో వ్యర్థాలు వేస్తున్న వారికి జరిమానాలు విధించాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. ఏడో డివిజన్లోని స్టోన్‌హౌస్‌పేట, తదితర ప్రాంతాల్లో చెత్త సేకరణ పనులను బుధవారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కాలువల్లో పూడికతీత పనులను క్రమం తప్పకుండా చేపట్టడంతో పాటు సిల్టును తొలగించాలని సూచించారు. తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందజేయాలని కోరారు. కార్పొరేటర్ కిన్నెర మాల్యాద్రి, ఎంహెచ్‌ఓ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.



జనరల్ నోటీసు

ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి మరియు ఇతర ఆస్తులు జాలాది వెంకటసుబ్బయ్య తండ్రి అప్పయ్య శెట్టి మరియు జాలాది యానాదమ్మ ఉరఫ్ కాంతమ్మ వ్రాసుకున్న రిజిష్టరు పత్రము నెం.2498/1945 తే26.09.1945 ప్రకారం జాలాది యానాదమ్మ ఉరఫ్ కాంతమ్మ గారికి అనుభవ హక్కు, ఆమె తదనంతరము జాలాది వెంకటసుబ్బయ్య గారికి పూర్తి హక్కులు సంక్రమించును. సదరు జాలాది వెంకటసుబ్బయ్య గారు సదరు ఆస్తుల గురించి తే30.08.1975దిన వీలునామా వ్రాయించి సదరు వీలునామా ప్రకారం ఆయన తదనంతరము మరియు ఆయన మొదటి భార్య యానాదమ్మ ఉరఫ్ కాంతమ్మ తదనంతరము రెండవ భార్య జాలాది పద్మావతమ్మ గారికి పూర్తి హక్కులు సంక్రమించును. తదుపరి జాలాది వెంకటసుబ్బయ్య గారు కాలం చేసినారు. ఆయన తదనంతరము జాలాది పద్మావతమ్మ గారు తనకు సంక్రమించబోవు ఆస్తుల గురించి రిజిష్టరు వీలునామా పత్రము నెం.82/ 1984 తే29.05.1984 ద్వారా వ్రాసినారు. తదుపరి జాలాది పద్మావతమ్మ గారు తే25.09.1984 దిన కాలం చేసినారు. ఆమె తదనంతరం జాలాది యానాదమ్మ ఉరఫ్ కాంతమ్మ తే14.05.2003దిన కాలం చేసినారు. సదరు వీలునామా ప్రకారం జాలాది లక్ష్మీనారాయణ, జాలాది వసంతరాజ మరియు వందవాసి జయంతి కుమారి గార్లకు పూర్తి హక్కులతో ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తి సంక్రమించినదని, వారు ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని జానా గిరిబాబు తండ్రి చిన సుబ్బరాయుడు గారికి రిజిష్టర్డు విక్రయ పత్రము నెం.1024/2003 తేది20.11.2003 ద్వారా అమ్మినారు. సదరు గిరి బాబు గారికి ఈ క్రింది షెడ్యూలు ఆస్తి ఆయన స్వాధీన హక్కు అనుభవంలో వున్నదని చెప్పుచూ నా కక్షిదారునికి అమ్ముచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి ఏలాంటి అన్యాక్రాంతములు, క్లెయిమ్‌లు లేవని చెప్పుచున్నారు. సదరు ఆస్తికి సంబంధించి ఏలాంటి క్లెయిమ్‌లు, హక్కులు కాని వున్న యెడల ఈ పత్రికా ప్రకటన వెలువడిన తేది నుండి 7 రోజుల లోపల నాకు వ్రాతమూలకముగా తెలుపుకొనగలరు. లేనిచో ఏలాంటి క్లెయిమ్‌లు, ఆక్షేపణలు లేవని భావించి సదరు ఆస్తిని నా కక్షిదారుడు కొనుగోలు చేయగలరు.

ఆస్తి షెడ్యూలు

శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్ యిలాకా, ఇందుకూరు పేట సబ్ రిజిస్ట్రారులో చేరిన నెల్లూరు మునిసిపల్ కార్పొరేషన్‌లో చేరిన గుడిపల్లిపాడు గ్రామంలోని సర్వే నెం.239/1రు య.0-54 సెంట్లు లేక 0.218 హెక్టార్లు భూమికి హద్దులు: తూర్పు: రోడ్డు, దక్షిణం: జానా సుబ్బారావు గారి భూమి, పడమర: వి.నిర్మల గారి భూమి, ఉత్తరం: జానా శ్రీనివాసులు గారి భూమి ఈ హద్దులలోని య.0-54 సెంట్లు లేక 0.218 హెక్టార్లు మాగాణి భూమిన్ని.

కొండూరు శేషారెడ్డి, బి.కాం., బి.యల్.,
అడ్వకేట్, బాలాజీనగర్, నెల్లూరు. సెల్: 94402 77290